సాక్షి
బాపట్ల

మంగళవారం । 5 । మార్చి । 2024



భక్తులకు అన్న సంతర్పణ

వేమూరు: బాల కోటేశ్వర కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య అన్నదానం సత్రంలో భక్తులకు అన్న సంతర్పణ చేయనున్నట్లు సత్రం అధ్యక్షుడు కొత్తమాసు సాంబశివరావు తెలిపారు.



ఘనంగా ఆలయ వార్షికోత్సవం

చిలకలూరిపేట: చిలకలూరిపేట మారుతీనగర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 515.40 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

యార్డులో 1,18,979 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,18,979 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,12,364 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.20,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.20,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 95,450 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

అమరేశ్వరుని హుండీ ఆదాయం రూ.20లక్షలు



అమరావతి: ప్రఖ్యాత శైవక్షేత్రం అమరావతి అమరేశ్వర స్వామివారి దేవస్థానం హుండీ కానుకల ఆదాయం రూ.20లక్షలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపినాథ శర్మ తెలిపారు. సోమవారం దేవాలయంలోని అన్ని హుండీల్లోని కానుకలను దేవదాయ శాఖ పరిశీలకులు వెంకట శ్రీనివాస్ పర్యవేక్షణలో లెక్కించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 80 రోజులకు హుండీల ద్వారా రూ.18,37,744లు, అన్నదానం హుండీల ద్వారా రూ.1,63,085లు ఆదాయం వచ్చిందన్నారు. లెక్కింపు కార్యక్రమంలో దేవాలయ సిబ్బంది, నరసరావుపేట సేవా సమితి, పెదకూరపాడు సేవా సమితి సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

20లోపు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

గుంటూరు వెస్ట్ : రిటైర్డ్ ఉద్యోగులు తమ లైఫ్ సర్టిఫికెట్లు ఈ నెల 20లోపు నేరుగా సబ్ ట్రెజరీ కార్యాలయంలో బయోమెట్రిక్ రూపంలో సమర్పించాలని ఏపీ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర కోశాధికారి పి.నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాస్తవానికి ఈ సర్టిఫికెట్లు అందజేయాల్సిన సమయం గత నెల 29తోనే ముగిసిందన్నారు. మంచంలో ఉన్నవారు, తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారు ఏటీఓకి తెలియజేస్తే పెన్షన్ ఆగకుండా చూస్తారని తెలిపారు.

ప్రత్తిపాటి శరత్ కస్టడీ పిటిషన్‌పై తీర్పు 6వ తేదీకి వాయిదా

సాక్షిప్రతినిధి, విజయవాడ: మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు ప్రత్తిపాటి పుల్లారావు తనయుడు శరత్ పోలీసు కస్టడీ పిటిషన్‌పై ఒకటవ అదనపు మెట్రోపాలిటన్ చీఫ్ మేజిస్ట్రేట్ కరీముల్లా తీర్పు వాయిదా వేశారు. అవెక్సా కార్పొరేషన్‌లో ప్రత్తిపాటి శరత్ అదనపు డైరెక్టర్‌గా ఉన్న సమయంలో డొల్ల కంపెనీలు సృష్టించి నిధుల మళ్లింపు, జీఎస్టీ ఇన్ పుట్ సబ్సిడీ పొందారని పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో శరత్ ఇప్పటికే జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న విషయం తెలిసిందే. శరత్‌ను తమ కస్టడీకి అప్పగించాలని మాచవరం పోలీసులు కోర్టులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ 1వ ఏసీఎంఎం కోర్టులో సోమవారం సాయంత్రం వాదనలు జరిగాయి. మేజిస్ట్రేట్ కరీముల్లా ఎదుట ఇరుపక్షాలు తమ వాదనలు వినిపించారు. కంపెనీ లావాదేవీలకు సంబంధించి ఇప్పటికే విచారణ పూర్తి అయిందని, ఈ దశలో పోలీసు కస్టడీకి నిందితుడిని ఇవ్వాల్సిన అవసరం లేదని డిఫెన్స్ న్యాయవాది కిలారు బెనర్జీ వాదనలు వినిపించారు. బోగస్ పత్రాలతో ఇన్పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందారని చెబుతున్న సమయంలో శరత్ కంపెనీలోకి ఇంకా ప్రవేశించ లేదన్నారు. కేవలం 67 రోజులు మాత్రమే ఆ సంస్థలో డైరెక్టర్‌గా ఉన్నారని వివరించారు. లేని సమయంలో జరిగిన వాటితో నిందితుడికి సంబంధం లేదన్నారు. కాగా, అక్రమాలను వెలికి తీయాల్సి ఉందని, నిందితుడు శరత్.. తన తండ్రి మంత్రిగా ఉన్న సమయంలో ఆయన పదవిని అడ్డుపెట్టుకుని అక్రమాలకు పాల్పడ్డారని, వీటిపై మరింత లోతుగా విచారించాల్సిన అవసరం ఉన్నందున పోలీసు కస్టడీకి ఇవ్వాలని ప్రభుత్వం తరపున హైకోర్టు పీపీ దుష్యంత్ రెడ్డి వాదనలు వినిపించారు. పలు డొల్ల కంపెనీలను సృష్టించి నిధులు మళ్లించినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. ఈ వ్యవహారంలో కోట్లాది రూపాయల అక్రమాలు చోటుచేసుకున్నాయని, దీనిపై నిందితుడిని పోలీసు కస్టడీలోకి తీసుకుని మరింతగా విచారిస్తే కానీ అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. ఇరు పక్షాల వాదనాలు విన్న మేజిస్ట్రేట్ పోలీసు కస్టడి పిటిషన్‌పై తీర్పును ఈనెల 6వ తేదీకి వాయిదా వేశారు. శరత్ తరపున దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై పోలీసులు అదే రోజు కౌంటర్ దాఖలు చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా ‘సిద్ధం’

- జిల్లా నుంచి భారీగా కార్యకర్తలు తరలిరావాలి
- సిద్ధం సభ సన్నాహక సమావేశంలో బాపట్ల ఎంపీ నందిగం సురేష్



సభలో మాట్లాడుతున్న బాపట్ల ఎంపీ నందిగం సురేష్, వేదికపై ఎమ్మెల్యే కరణం బలరాం

చీరాల: ‘సిద్ధం సభకు సైనికుల్లా పనిచేద్దాం.. ప్రతి కార్యకర్త, నాయకులు కదం తొక్కి చరిత్రలో నిలిచిపోయేలా సిద్ధం సభను విజయవంతం చేసి చీరాల నియోజకవర్గానికి పేరు తీసుకురావాలని బాపట్ల ఎంపీ నందిగం సురేష్, వైఎస్సార్ సీపీ చీరాల సమన్వయకర్త కరణం వెంకటేష్‌లు పేర్కొన్నారు. సోమవారం రాత్రి రామకృష్ణాపురంలోని పార్టీ కార్యాలయంలో సిద్ధం సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఎన్నికల్లో గెలిచేందుకు జిత్తులమారి వేషాలు వేస్తున్నారని, పొత్తుల కోసం అందరి కాళ్లు పట్టుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో దోచుకున్న డబ్బు సింగపూర్‌లో దాచుకున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల జీవితాన్ని మార్చారని పేర్కొన్నారు. తన వంటి ఒక సామాన్యుడిని ఎంపీని చేసి ప్రధానమంత్రి పాల్గొనే సభలో కూర్చోబెట్టారని గుర్తు చేశారు. తనకు మళ్లీ ఎంపీ సీటు ఇచ్చినా, ఇవ్వకపోయినా జగన్ కారు డ్రైవర్‌గా అయినా పనిచేసేందుకు తాను సిద్ధమన్నారు. 2019 ఎన్నికల్లో చీరాలలో తనకు ఎమ్మెల్యే అభ్యర్థి కంటే ఎక్కువ మెజార్టీ ఇచ్చి గెలిపించిన ప్రజల మేలు మరవలేనన్నారు. చంద్రబాబు రాజకీయ వ్యభిచారి అని, అతను గెలిచేందుకు ఎన్ని కుయుక్తులు అయినా పన్నుతారన్నారు. రాజధాని భూములు తాను తగలబెట్టానని పచ్చి అబద్ధాలు చెబుతున్నారన్నారు. 40 ఏళ్ల సీనియారిటీగా చెబుతున్న చంద్రబాబు ఏనాడైనా నీతిమంతమైన పాలన చేశారా అని అన్నారు. ఎన్టీఆర్‌ను మోసం చేసి పార్టీని లాక్కున్నారన్నారు. అమరావతిలో రాజధాని కడతానని చెప్పి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకున్నారన్నారు. ప్యాకేజీ స్టార్ పవన్ కల్యాణ్‌తో జతకట్టి ముఖ్యమంత్రి అవ్వాలని కలలు కంటున్నారన్నారు. బీజేపీతో పొత్తు పెట్టుకోవాలని ఉవ్విళ్లూరిన బాబును బీజేపీ నేతలు బయటకు పంపారన్నారు. అమ్మ ఒడి, ఇంగ్లిష్ మీడియం విద్య, పేదలకు ఇళ్ల స్థలాలు వంటి వాటిపై కూడా కోర్టుకెళ్లిన బాబు నీచ రాజకీయాలు ప్రజలు గమనించాలన్నారు. ఐదేళ్ల పాలనలో పేదరికం తగ్గించిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. మళ్లీ జగన్ ఎందుకు అవసరమో ప్రజలకు వివరించాలన్నారు. సిద్ధం సభకు చీరాల నుంచి భారీగా తర రావాలని సూచించారు.

జగన్ పథకాలే మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తాయి..

రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక లోటులో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టిన పథకాలే ఆయనను సీఎంను చేస్తాయని ఎమ్మెల్యే కరణం బలరాం అన్నారు. 2019లో చీరాలలో కొన్ని విపత్కర పరిస్థితులు ఉన్నాయన్నారు. అయితే అనుకోని పరిస్థితుల్లో తాను పోటీ చేయడం, చీరాల ప్రజలు బ్రహ్మరథం పట్టడం జరిగిందన్నారు. ఈ నాలుగేళ్లలో సంక్షేమం, అభివృద్ధిని చీరాల ప్రజలు చూశారన్నారు. కక్షలు కార్పణ్యాలు లేవన్నారు.

సిద్ధం సభకు సన్నద్ధమవుదాం..

పార్టీ సమన్వయకర్త కరణం వెంకటేష్ మాట్లాడుతూ మన జిల్లాలో మేదరమెట్ల వద్ద ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సిద్ధం చివరి సభను నియోజకవర్గంలోని ప్రతి నాయకుడు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు ప్రతిష్టాత్మకంగా తీసుకుని సైనికుల్లా పనిచేయాలన్నారు. కనీసం 25–30 వేల మంది చీరాల నుంచి తరలించడం మన కర్తవ్యమన్నారు. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని 218 బూత్ కమిటీలు ఉన్నాయని, ఈ కమిటీ అధ్యక్షులు, సభ్యులంతా కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కేవలం రెండు నెలలు కష్టపడితే చీరాలలో మొదటిసారిగా వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి ముఖ్యమంత్రి జగన్‌కు గిఫ్టుగా ఇద్దామన్నారు. నియోజకవర్గంలో సంక్షేమం, జరిగిన అభివృద్ధిని గణాంకాలలో వివరించారు. త్వరలో చీరాలలో కూడా ముఖ్యమంత్రి సభ ఉంటుందని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లి వైష్ణవి, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, పార్టీ పట్టణ, రూరల్ అధ్యక్షులు కోండ్రు బాబ్జి, అంకాలరెడ్డి, బి.సుబ్బారావు, డాక్టర్ జి.సుబ్బారావు, కోలా శివ, దాసరి రామకృష్ణ, బుర్ల సాంబశివరావు, లేళ్ల శ్రీధర్, చిలుకోటి శ్రీను, మల్లెల లలిత, గోలి స్వాతి, యాతం మేరిబాబు, శిఖా సురేష్, రొండా భరత్‌రెడ్డి, షేక్ ఇలియాజ్, గోలి గిరిధర్, ఎన్.రాజ్ కుమార్, మించాల సాంబశివరావు, బండికళ్ల నరేష్, బత్తుల అనిల్, తదితరులు పాల్గొన్నారు.

సభ దిగ్విజయమయ్యేలా ఏర్పాట్లు

- జగనన్న మళ్లీ సీఎంగా గెలిచి సుపరిపాలన కొనసాగిస్తారు
- చీరాల నియోజకవర్గ సమన్వయకర్త కరణం
- సభ ఏర్పాట్లు పరిశీలన

చీరాల, మేదరమెట్ల: పేదల సంక్షేమానికి...రాష్ట్రాభివృద్ధికి అంకుఠిత దీక్షతో పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంగా సుపరిపాలన కొనసాగిస్తారని, చరిత్రలో నిలిచిపోయేలా ‘సిద్ధం–4’ సభను విజయవంతం చేస్తామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్ అన్నారు. సోమవారం అద్దంకి నియోజకవర్గంలోని కొరిశపాడు మండలం పిచికలగుడిపాడులో ఈనెల 10న జరగనున్న సిద్ధం సభ ఏర్పాట్లను కరణం వెంకటేష్ పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతు బాపట్ల జిల్లాలోని అద్దంకి నియోజకవర్గంలో జరగ నున్న సిద్ధం సభకు సంబంధించి ఎక్కడా లోటు పాట్లు లేకుండా దిగ్విజయంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. లక్షలాదిమంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు హాజరయ్యేందుకు అన్ని ఏర్పాట్లను ప్యానల్ కమిటీ పరిశీలిస్తుందన్నారు. చరిత్రలో నిలిచిపోయేలా, రాష్ట్ర భవిష్యత్తు సువర్ణయుగంగా మార్చి జగనన్న ముఖ్యమంత్రి పీఠం అధిరోహిస్తారన్నారు. బండికళ్ల నరేష్, గోపాల్, నాయకులు ఉన్నారు.



సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కరణం వెంకటేష్

గోవాడ తిరునాళ్లను విజయవంతం చేద్దాం

రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ



గోవాడ(వేమూరు): ఈ నెల 8వ తేదీన మహాశివరాత్రి సందర్భంగా గోవాడ బాల కోటేశ్వర స్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో కృషి చేసి, విజయవంతం చేయాలని రేపల్లె డీఎస్పీ తుపాకుల మురళీకృష్ణ తెలిపారు. సోమవారం బాల కోటేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రేపల్లె ఆర్డీఓ హేలా షారోన్ అధ్యక్షత వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ అమర్తలూరు మండలంలోని గోవాడ బాల కోటేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఆలయ ప్రాంగణం చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం తెనాలి నుంచి 22, పొన్నూరు, బాపట్ల నుంచి 10, రేపల్లె నుంచి 15 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఆలయ సమీపంలో భక్తుల కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్యాధికారులను సూచించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఆలపాటి రమాదేవి, ఈఓ అశోక్ రెడ్డిలు మాట్లాడుతూ భక్తులకు ఎండ తీవ్రత లేకుండా ఆలయం చుట్టూ చలువ పందిళ్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భక్తుల దాహార్తిని తీర్చడానికి మినరల్ వాటర్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఆలయం తరపున విద్యుత్ ప్రభను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి పశువులు ప్రదక్షిణ కోసం వస్తాయని కాల్వల్లో నీటిని విడదల చేయాలని ఇరిగేషన్ అధికారులను కోరారు. ఉత్సవ ప్రత్యేక అధికారి అమర్నాథ్, సర్పంచ్ విజయలక్ష్మి, తహసీల్దార్ కవిత, సీఐ శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే రాష్ట్ర సంక్షేమం

- మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేస్తాం
- రైతులు, హమాలీలతో బత్తుల, బాలాజీ
- మార్టూరు కూరగాయల మార్కెట్‌కు రూ.70లక్షలు మంజూరు



మార్టూరులో సెంట్రల్ లైటింగ్ సిస్టంను ప్రారంభిస్తున్న బత్తుల, బాలాజీ

మార్టూరు: రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందనే భావనతో తమ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందని, వ్యవసాయంలో మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయడంపై మరింత దృష్టి సారిస్తామని రాష్ట్ర మార్కెటింగ్, కో ఆపరేటింగ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. మార్టూరు కూరగాయల మార్కెట్‌లో సోమవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీతో కలిసి ఆయన మాట్లాడారు. మార్కెటింగ్ శాఖ నుంచి మార్టూరు కూరగాయల మార్కెట్‌కు రూ.70 లక్షల నిధులు మంజూరు చేశామన్నారు. అందులో రూ.25 లక్షలతో రైతులు వ్యాపారులు, హమాలీల సౌకర్యార్థం మార్కెట్ నలువైపులా ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మిగిలిన రూ.45 లక్షల నిధులతో మార్కెట్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. మార్కెట్‌లోని వ్యర్థాల సంపద సృష్టి, రైతుల కోసం విశ్రాంతి భవనం, తక్కువ ధరలతో క్యాంటీన్ సదుపాయం, తదితర అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పర్చూరు సమన్వయకర్త యడం బాలాజీ మాట్లాడుతు ప్రజలు, రైతులు గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి సంక్షేమ పథకాల అమలులో వ్యత్యాసాలను గమనించి వచ్చే ఎన్నికల్లో తిరిగి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కూరగాయల మార్కెట్‌కు అవసరమైన అన్ని హంగులు, సౌకర్యాల కోసం బత్తుల బ్రహ్మానందరెడ్డితో కలిసి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మార్కెటింగ్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ 12 సంవత్సరాలుగా స్థానిక మార్కెట్‌లోని హమాలీలకు లైసెన్స్‌లు, యూనీఫాంలు ఇవ్వలేకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో లైసెన్స్‌లు, యూనిఫారంలు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. లైసెన్స్‌లు కలిగిన హమాలీలు ఎటువంటి బీమా చెల్లించకుండానే వారు ప్రమాదవశాత్తూ మరణించిన సందర్భంలో తమ శాఖ నుండి బాధిత కుటుంబాలకు రూ 2 లక్షల బీమాను లబ్ధి చేకూరుతుందన్నారు. బత్తుల, బాలాజీలు స్థానిక నాయకులతో కలిసి సెంట్రల్ లైటింగ్ సిస్టంను ప్రారంభించారు. అనంతరం 236 మంది హమాలీలకు లైసెన్స్‌లు, యూనిఫాంలు పంపిణీ చేశారు. మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.ఝాన్సీరాణి, ఏడీఎం కె.రమేష్ బాబు, కార్యదర్శి కె.రామకృష్ణ, పార్టీ నాయకులు ఉప్పలపాటి చెంగలయ్య, పఠాన్ కాలేషావలి, షేక్ రషీద్, దారా రామారావు, కొల్లాటి ఏడుకొండలు, పోలూరి శివారెడ్డి, బాబూనాయక్, రవిచంద్, బండారు ప్రభాకరరావు, యర్రం లక్ష్మారెడ్డి, రాజానాయక్, వెంకటేశ్వరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు కృషి

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించడానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. ఎంసీసీ కమిటీలోని అధికారులకు సోమవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం ఏర్పాటుచేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి రాగానే అధికారులు అప్రమత్తం కావాలని చెప్పారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి మండల స్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత ఎంసీసీ కమిటీపై ఉందన్నారు. అధికారిక సమావేశాలు నిర్వహించరాదని, ఏదైనా ప్రారంభించే కార్యక్రమాలకు నిషేధం వర్తిస్తుందన్నారు. ఎన్నికలలో పోటీ చేసే పార్టీలు, ఆయా అభ్యర్థులకు సమాన అవకాశాలు ఎన్నికల కమిషన్ కల్పిస్తుందన్నారు. అభ్యర్థుల ప్రచారాలు, సభలు, సమావేశాలపై నిశిత పరిశీలన, నిఘా ఉంచాలన్నారు. ఆ పార్టీలు వెచ్చిస్తున్న వాటిని, అభ్యర్థుల ఖర్చులను ఎప్పటికప్పుడు పరిశీలించి నమోదు చేయాలన్నారు. విభిన్న రీతిలో ప్రచారాలు ఉంటాయని వాటిని గుర్తించాలన్నారు. ముఖ్యంగా నగదు, వస్తువులు, ఇతర బహుమతులతో ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉందన్నారు. కుల, మతాలతో పలువురిని ప్రభావితం చేయడం నిబంధనలను ఉల్లంఘించడమేనన్నారు. ఆధ్యాత్మిక ప్రార్థన మందిరాలలో అభ్యర్థులు సమావేశాలు నిర్వహించరాదన్నారు. నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత ఎంసీసీ అధికారులపై ఉందన్నారు. మండల స్థాయిలోని ఇతర కమిటీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని ఆయన పలు సూచనలు చేశారు. ముందుగా జిల్లా ప్రణాళికా అధికారి కె.శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్యలు పలుఅంశాలపై శిక్షణ ఇచ్చారు. జేసీ సీహెచ్ శ్రీధర్, ఏఎస్పీ పి.మహేష్, డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ కేంద్రంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు జరుగుతున్నాయి. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా గర్భాశయ క్యాన్సర్, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ పరీక్షలు 7వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ వెల్లడించారు. సోమవారం ప్రభుత్వ ఆసుపత్రి నాట్కో క్యాన్సర్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. గుంటూరు జీజీహెచ్, గుంటూరు మెడికల్ కాలేజీలో పనిచేసే మహిళా ఉద్యోగులకు ప్రత్యేకంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్యాన్సర్ పరీక్షలతో పాటు రక్త పరీక్షలు చేస్తారని తెలిపారు. ఈ పరీక్షలు నిరంతరంగా జరిగే విధంగా ప్రణాళికలను సిద్ధం చేశామని, డీఎంఈ డాక్టర్ నరసింహం ఆదేశాల మేరకు ఈ పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. 40 నుంచి 45 సంవత్సరాల మహిళలు ముందస్తుగా క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించడానికి ఈ పరీక్షలు ఉపయోగపడతాయన్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీటీకే రెడ్డి, క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ జాహ్నవి, డాక్టర్ వెంకటరెడ్డి, ప్రొఫెసర్ డాక్టర్ జయంతి, ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్ పాల్గొన్నారు.

గడువులోపు పరిష్కరించకుంటే చర్యలు

- స్పందనలో జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్
- 63 అర్జీలు స్వీకరణ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ చామకూరి శ్రీధర్

బాపట్ల: స్పందన అర్జీలకు నిర్ణీత గడువులోగా అధికారులు పరిష్కారం చూపాలని, లేకుంటే చర్యలు తప్పవని జిల్లా సంయుక్త కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. స్పందన కార్యక్రమం స్థానిక కలెక్టరేట్ లోని స్పందన సమావేశ మందిరంలో సోమవారం జరిగింది. స్పందనకు మొత్తం 63 అర్జీలు అందాయి. తన పరిధిలోని వాటికి ఆయన అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపారు. మిగిలిన వాటిని పరిశీలించి, విచారించాలని మండల స్థాయి అధికారులకు సూచించారు. స్పందన అర్జీలు పెండింగ్‌లో ఉండరాదని జిల్లా సంయుక్త కలెక్టర్ శ్రీధర్ స్పష్టం చేశారు. అర్జీల పరిష్కారంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో పునరావృతం అవుతున్నాయని వివరించారు. ప్రతి అర్జీని నిశితంగా పరిశీలించి ప్రజలకు మేలు జరిగేలా చూడాలన్నారు. రేపల్లె ఆర్డీఓ వద్ద 3, సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ శాఖలో 2, చీరాల ఆర్డీఓ వద్ద 2, సీపీడీసీఎల్ వద్ద 2, పోలీస్ శాఖలో 7 అర్జీలు పునరావృతం అయ్యాయన్నారు. చుక్కల భూమి నుంచి తొలగించాలంటూ వచ్చిన దరఖాస్తులు 19 పెండింగ్‌లో ఉండడంపై ఆరా తీశారు. జర్నలిస్టుల ఇంటి స్థలాల పంపిణీ కోసం కొన్ని మండలాల్లో నేటికీ భూమి గుర్తించకపోవడం ఏంటంటూ తహసీల్దార్లను నిలదీశారు. ప్రత్యేక దృష్టిసారించి భూమిని గుర్తించాలని, సత్వరమే ఆ భూమిని కేటాయించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు సమర్థంగా నిర్వహించాలన్నారు. మిగ్ జాం తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలకు ఈనెల ఆరో తేదీన నష్టపరిహారం పంపిణీ జరగనుందన్నారు. నిర్మాణాలు పూర్తిచేసిన 18 గ్రామ సచివాలయాలు, 10 రైతు భరోసా కేంద్రాలు, 7 ఆరోగ్య కేంద్రాల భవనాలను వారంలోగా ప్రారంభించాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, బాపట్ల ఆర్డీఓ జి.రవీందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చక్కటి దరహాసం కాదంత కష్టం

- దంత వైద్యంలో ఆధునిక పద్ధతులు
- అందుబాటులో కాస్మొటిక్ వైద్యవిధానం
- చిన్నారులకు పిడోడాంటిక్ ట్రీట్‌మెంట్
- రేపు జాతీయ దంత వైద్యుల దినోత్సవం



జీజీహెచ్‌లో దంత వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ భవనం ప్రతాప్‌రెడ్డి

గుంటూరు మెడికల్: దంత సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు, దంత వైద్యులకు కృతజ్ఞతలు తెలియజేసేందుకు ప్రతి ఏడాది మార్చి 6వ తేదీన జాతీయ దంత వైద్యుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ‘సాక్షి’ అందిస్తున్న ప్రత్యేక కథనం.

కాస్మొటిక్ వైద్య పద్ధతులు..

ఒకప్పుడు పన్ను పుచ్చిపోతే పీకి వేయడం తప్ప వేరే ఆలోచన ఉండేదికాదు. నేడు దంత వైద్యశాస్త్రం (డెంటిస్ట్రీ) బాగా అభివృద్ధి చెందడంతో పూర్తిగా పాడైన పళ్లను సైతం పీకే పనిలేకుండా మరమ్మతులు చేసి సాధారణ దంతంలాగా తయారు చేస్తున్నారు. నేడు పన్ను పీకకుండా రూట్‌కెనాల్ చికిత్స అందుబాటులో ఉంది. పాచిపట్టిన, గారపట్టిన పళ్లను స్కేలింగ్ ద్వార శుభ్రం చేస్తున్నారు. కదిలిన, అరిగిన పళ్లకు, చిగుళ్ల సమస్యకు ఫ్లాప్ సర్జరీ, పళ్లు లేనివారికి (ఊడిపోయినవారికి) ఇంప్లాంట్స్ సహాయంతో ఫిక్స్‌డ్ పళ్లు, షుగర్‌వల్ల దంతాలు ఊడిపోతున్నవారికి బేసల్ ఇంప్లాంట్స్ ద్వారా ఫిక్స్‌డ్ పళ్లు, ఎత్తు పళ్లు, వంకర పళ్లు ఉన్నవారికి కాస్మొటిక్ బ్రెసెస్‌తో ఆర్థో ట్రీట్‌మెంట్ సేవలు ఉన్నాయి. చిన్న పిల్లలకు పళ్లు పుచ్చిపోకుండా పళ్ళు ఎగుడుదిగుడులా లేకుండా పళ్ల వరుస అందంగా ఉండేలా పిడోడాంటిక్ ట్రీట్‌మెంట్ నేడు అందుబాటులో ఉంది. సాధారణ చికిత్సల మాదిరిగా దంత వైద్యంలో సైతం కాస్మొటిక్ వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో ముఖారవిందం పాడవకుండా చిరునవ్వులు చెరిగిపోకుండా దంతాలను అందంగా అమర్చుతున్నారు.

జీజీహెచ్‌లో ఉచిత వైద్యం



గుంటూరు జీజీహెచ్‌కు ప్రతిరోజూ 50 నుంచి 60 మంది వివిధ రకాల దంత సమస్యలతో వస్తున్నారు. పుచ్చిపోయిన దంతాలను సిమెంట్‌తో ఫిల్ చేయడం, బాగా పుచ్చిపోయిన దంతాలను కొద్దిపాటి మత్తు ఇచ్చి పీకివేయడం, గార పట్టిన దంతాలను క్లీనింగ్ చేస్తున్నారు. పెద్దాసుపత్రిలో స్పెషాలిటీ వైద్య నిపుణులు అందుబాటులో ఉండటంతో అత్యాధునిక దంత శస్త్రచికిత్సలు సైతం ఉచితంగా చేస్తున్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ భవనం ప్రతాప్‌రెడ్డి, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ నాగసాయి వైద్యసేవలు అందిస్తున్నారు. వారంలో 10 నుంచి 15 ఆపరేషన్లు సైతం ఉచితంగా చేస్తున్నారు.

– డాక్టర్ సి.హెచ్.పార్వతి, దంత వైద్య విభాగాధిపతి, జీజీహెచ్

దంత సమస్యలపై అవగాహన అవసరం..



ప్రతి ఒక్కరూ దంత సమస్యలపై అవగాహన కలిగి ఉండాలి. ప్రాథమిక దశలోనే దంత వైద్యులను సంప్రదించటం ద్వారా పన్ను పూర్తిగా పాడవ్వకుండా వైద్యం అందించవచ్చు. పిల్లలకు తరచుగా దంత వైద్య సమస్యలు వస్తుంటాయి. వాటిని తల్లిదండ్రులు గమనించి దంత వైద్యులను సంప్రదించాలి. ప్రతి ఆరునెలలకు ఒకసారి తప్పనిసరిగా టూత్ బ్రష్‌ను మార్చాలి. ప్రతి రోజూ రెండు పూటలా దంతాలు శుభ్రం చేసుకోవాలి. ఏదైనా ఆహారం తిన్న వెంటనే నోటిలో నీరు పోసుకుని పుక్కిలించాలి.

– డాక్టర్ చింతా వాసవి, దంత వైద్య నిపుణురాలు

క్లుప్తంగా

గురుకుల కళాశాలలో ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో పాత గుంటూరు నందివెలుగు రోడ్డులో నిర్వహిస్తున్న ఉర్దూ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శిరీష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోస్తాంధ్రలోని శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు ఉన్న ముస్లిం, మైనార్టీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నడుపుతున్న ఏకైక కళాశాల ఇదేనని పేర్కొన్నారు. ఏపీఆర్‌జేసీ సెట్‌తో సంబంధం లేకుండా టెన్త్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులు నేరుగా ప్రవేశాన్ని పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు ఇంగ్లీషు మీడియంలో నిర్వహిస్తున్నామని, ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని ముస్లిం, మైనార్టీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు కళాశాలలో నేరుగాను, 98495 59611, 87126 25073 సెల్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ ఇంగ్లిష్ పరీక్ష

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం ప్రథమ సంవత్సర ఇంగ్లిష్–1 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 92 పరీక్ష కేంద్రాల పరిధిలో సైన్స్, ఆర్ట్స్ కోర్సుల నుంచి దరఖాస్తు చేసిన 31,748 మంది విద్యార్థుల్లో 31,051 మంది హాజరయ్యారు. అదే విధంగా ఒకేషనల్ కోర్సుల వారీగా 1,155 మంది విద్యార్థులకు 1,032 మంది చొప్పున హాజరయ్యారు. జిల్లాలో ఎక్కడా మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదని ఆర్ఐవో జీకే జుబేర్ తెలిపారు.

మెప్మా రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక



తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి బైపాస్‌రోడ్‌లోని కుంచనపల్లి వద్ద మెప్మా కార్యాలయంలో సోమవారం రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు కె.సునీల్ మాట్లాడుతూ వైస్ ప్రెసిడెంట్‌గా మాధవరావు, సెక్రటరీ పెంచలయ్య, జాయింట్ సెక్రటరీగా దుర్గా ప్రసాద్, ట్రెజరర్‌గా అప్పలనాయుడు, కన్వీనర్లుగా కటకం అశోక్‌కుమార్, తదితరులను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం నిర్వహించారు.

కానిస్టేబుల్ గోపిరెడ్డి అంత్యక్రియలు

- హాజరైన ప్రభుత్వ చీఫ్ విప్ పిన్నెల్లి
- కుటుంబానికి రూ.5 లక్షల సాయం

బాపట్లటౌన్: రోడ్డు ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ గోపిరెడ్డి మృతి చెందిన విషయం తెలిసిందే. బాపట్ల పట్టణంలోని ఉప్పరపాలెంలో సోమవారం కానిస్టేబుల్ గోపిరెడ్డి అంత్యక్రియలు అధికార లాంఛనాల మధ్య జరిగాయి. తొలుత ప్రభుత్వ చీఫ్ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గోపిరెడ్డి నివాసానికి చేరుకొని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి భార్యకు రూ.5 లక్షల నగదు, నివేశన ఇంటి స్థలం కాగితాలను అందజేశారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా తన వద్ద వ్యక్తిగత గన్‌మెన్‌గా గోపిరెడ్డి విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, బాపట్ల ఎమ్మెల్యే తనయుడు కోన నిఖిల్ పాల్గొన్నారు. విధులు ముగించుకొని స్వగ్రామానికి తిరిగి వస్తూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఏఆర్ కానిస్టేబుల్ గోపిరెడ్డి అంత్యక్రియలు సోమవారం పట్టణంలోని ఉప్పరపాలెం శ్మశానవాటికలో అధికార లాంఛనాలతో నిర్వహించారు. బాపట్ల డీఎస్పీ సిహెచ్.మురళీకృష్ణ, ఏఆర్ డీఎస్పీ, బాపట్ల పట్టణ సీఐ శ్రీనివాసులు హాజరయ్యారు.



గోపిరెడ్డి మృతదేహం వద్ద పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పిన్నెల్లి బ్రదర్స్

అందుబాటులోకి ప్రివెంటివ్ ఆంకాలజీ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో క్యాన్సర్ వ్యాధులను ముందస్తుగానే గుర్తించి చికిత్స చేసేందుకు ప్రివెంటీవ్ ఆంకాలజీ వైద్య విభాగాన్ని నూతనంగా ఏర్పాటు చేశారు. సోమవారం జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో సదరు వైద్య విభాగాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె. రెడ్డి ప్రారంభించారు. డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలు ఉందని అనుమానాలు ఉంటే వెంటనే ఓపీ వద్దకు వచ్చి స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్యాన్సర్ ఉందో లేదో నిర్ధారణ చేసుకున్న తర్వాత క్యాన్సర్ లేకపోతే ప్రశాంతంగా ఇంటికి వెళ్లి పోవచ్చన్నారు.

క్యాన్సర్ లక్షణాలు కనపడితే వెంటనే పరీక్షలు చేసుకోవడానికి అవకాశం కలుగుతుందన్నారు. ప్రివెంటివ్ ఆంకాలజీ వైద్య విభాగం ఏర్పాటు వల్ల సరైన సమయంలో క్యాన్సర్ గుర్తించే అవకాశం కలుగుతోందన్నారు. ముందస్తుగానే క్యాన్సర్‌ను గుర్తించడమే కాకుండా వ్యాధి నివారణ చర్యలు తీసుకోవచ్చన్నారు. జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ కేంద్రంలో ప్రతిరోజు ఓపీని ఏర్పాటు చేశామన్నారు. ప్రజల్లో క్యాన్సర్‌పై అవగాహన కల్పించడానికి ప్రత్యేక ఓపీని ప్రారంభించామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో క్యాన్సర్ వైద్య విభాగం ప్రొఫెసర్లు డాక్టర్ జి.దుర్గ ప్రసాద్, డాక్టర్ టి.వి.శివరామకృష్ణ, అసిస్టెంట్‌ప్రొఫెసర్లు డాక్టర్ జాహ్నవి, డాక్టర్ వెంకటరెడ్డి, సివిల్ సర్జన్ ఆర్ ఎం ఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ గంగమ్మ, పాల్గొన్నారు.



ప్రివెంటీవ్ ఆంకాలజీ విభాగాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ టి.టి.కె.రెడ్డి

మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు

గుంటూరు మెడికల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఏపీఎన్జీ జీవో అసోసియేషన్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో సోమవారం గుంటూరులోని ఎన్జీవో హోంలో మహిళ ఉద్యోగినులకు ఆటల పోటీలు జరిగాయి. పోటీలను ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. టగ్ ఆఫ్ వార్, లెమన్ అండ్ స్పూన్, గోలి ఇన్ బాటిల్, మ్యూజికల్ చైర్స్ తదితర పోటీలు నిర్వహించారు. మంగళవారం సాంస్కృతిక విభాగంలో నృత్యం, ఫాన్సీ డ్రెస్ కాంపిటేషన్, వన్ మినిట్ తెలుగు పాటల పోటీల కార్యక్రమాలు ఉంటాయని శ్రీనివాసరావు వెల్లడించారు. పోటీల్లో పాల్గొనే మహిళ ఉద్యోగులకు ప్రత్యేక అనుమతులు జిల్లా అధికారులు ఇచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి ఎ.శ్యాంసుందర్, జిల్లా మహిళా సంయుక్త కార్యదర్శి కె.శివజ్యోతి, నగర అధ్యక్షుడు ఎస్.పి.ఎస్.సూరి, కార్యదర్శి చింతల కల్యాణ్ కుమార్, అనిల్, ఎం.శ్రీనివాసరావు, మహిళా విభాగం జిల్లా చైర్పర్సన్ రాధారాణి, కన్వీనర్ కె.లక్ష్మీరమ్య పాల్గొన్నారు.



చంపుతామని బెదిరిస్తున్నారు..

ఎస్పీ స్పందనలో వృద్ధురాలి అర్జీ

బాపట్లటౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 56 మంది బాధితులు హాజరై తమ సమస్యలను నేరుగా ఎస్పీకు విన్నవించారు. బాధితుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ వకుల్‌జిందాల్, అడిషనల్ ఎస్పీ పి.మహేష్ వెంటనే సంబంధిత సీఐ, ఎస్ఐలతో మాట్లాడి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.



దివ్యాంగురాలి సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్‌జిందాల్

“ బాటలో నడిస్తే బెదిరిస్తున్నారు..

నేను, నా భర్త తోటకూర పెద్ద సుబ్బారావు రిటైర్డు ఉపాధ్యాయులం. మా ఇంటి పక్కనే నివాసం ఉంటే కాకి రామకోటేశ్వరరావు మాకు హక్కు కలిగిన బాటలో నుంచి మమ్ములను నడవనీయకుండా అడ్డుకుంటున్నాడు. బాటలో నడిస్తే మీ ఇరువురిని చంపుతామని బెదిరిస్తున్నాడు. నేను ఇప్పటికే రెండు సార్లు గుండె ఆపరేషన్ చేయించుకొని ఉన్నాను. ఏ క్షణాన ఏం జరుగుతుందోనని భయంగా ఉంది.

– తోట లక్ష్మీకాంతమ్మ, బీమవారిపాలెం

వీరయ్య వలన ప్రాణహాని

పట్టణంలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వర ఏజెన్సీలో పనిచేస్తున్నా. మా షాపు యజమాని రవికుమార్ ఇంట్లో అద్దెకు ఉంటున్నా. మా ఇంటి పక్కనే నివాసం ఉంటే లోబాకుల వీరయ్య నిత్యం నన్ను మానసికంగా వేధిస్తున్నాడు. నేను ఇంట్లో షాపు వచ్చేటప్పుడు, షాపు నుంచి తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో నన్ను వెంబడిస్తూ ఇష్టానుసారంగా దుర్భాషలాడుతూ ఇటీవల రాత్రి సమయంలో నన్ను నడిరోడ్డుపై పట్టుకొని అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే నన్ను చంపుతానని బెదిరిస్తున్నాడు. న్యాయం చేయండి.

– నరేంద్ర ఫెయిత్, నరసాయపాలెం

డబ్బులు అడిగితే చంపుతానంటున్నాడు..

గ్రామానికి చెందిన నేను పుట్టుకతోనే వికలాంగురాలిని. నా తల్లిదండ్రులు చిన్న తనంలోనే చనిపోయారు. నేను ప్రభుత్వం అందించే పింఛనుపై ఆధారపడి జీవిస్తున్నా. నేను కూడపెట్టుకున్న సొమ్ము రూ.5 లక్షలు మా గ్రామానికి చెందిన పిట్టు గోపి కృష్ణ అను వ్యక్తి వడ్డీతో కలిపి ఇస్తానని తీసుకున్నారు. మూడు సంవత్సరాలు గడిచిన ఇవ్వకుండా ఇదేమని అడిగితే నీకు దిక్కున్నచోట చెప్పుకో... ఇంకా ఏమైనా అతిగా మాట్లాడితే చంపుతానని బెదిరిస్తున్నారు.

– పిట్టు మల్లేశ్వరి, పిట్టువారిపాలెం ”

కేంద్రాల మార్పునకు మార్గదర్శకాలు ప్రదానం

–కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్ : కనీస వసతులు లేని, శిథిలమైన, ఆగ్జలరీ పోలింగ్ కేంద్రాల మార్పునకు ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాప్రతినిధుల, అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ క్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. ఒక్కో కేంద్రంలో 1450 మంది కంటే ఓటర్లుంటే ఆగ్జలరీ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసుకోవాలన్నారు. వీటికి సంబంధించి ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. తాడికొండ, ఫిరంగిపురం మండలం బేతపూడి పోలింగ్ కేంద్రాల మార్పునకు ఇప్పటికే ప్రతిపాదనలు ఎన్నికల సంఘానికి పంపామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, డీఆర్వో చంద్రశేఖర రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎ.అరవిందరావు, లక్ష్మీకుమారి, గుంటూరు ఆర్డీఓ పి.శ్రీకర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

మత్స్యకారుల ఆదాయం రెట్టింపు కావాలి

మత్స్యకారులు, ఆక్వా రైతుల ఆదాయం రెట్టింపు చేయడంతోపాటు ఉపాధి అవకాశాలు మెరుగుపరచేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకంతో ఎన్నో ప్రయోజనాలున్నాయన్నారు. దీన్లో అనేక రాయితీలతో పాటు సౌలభ్యాలున్నాయని తెలిపారు. మత్స్య సంపదవల్ల ప్రజలకు పోషక విలువలతో కూడిన ఆహారం లభిస్తుందన్నారు. ఈ ఉద్దేశ్యంతోనే రిటైల్ అవుట్‌లెట్స్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. మత్స్యకారుల తలసరి ఆదాయాన్ని 8.2 కేజీల నుంచి 20 కేజీల వరకు పెంచాలనేది ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో ఫిష్ ఔట్‌లెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా మత్స్యశాఖాధికారి గాలి దేముడు మాట్లాడుతూ జిల్లాలో 80 ఫిష్ వెండింగ్ ఔట్‌లెట్స్ ఉన్నాయన్నారు. మరో 68 యూనిట్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీఓ పి.శ్రీకర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

‘సిద్ధం’ సభకు సన్నద్ధం కండి

మంత్రి అంబటి రాంబాబు

లంకెలకూరపాడు(ముప్పాళ్ల): వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 10న ప్రకాశం జిల్లా మేదరమెట్ల సమీపంలో నిర్వహించనున్న ‘సిద్ధం’ సభకు వైఎస్సార్ సీపీ శ్రేణులు సన్నద్ధం కావాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. మండలంలోని లంకెలకూరపాడు గ్రామంలో సభ సన్నాహక సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. బుల్లెట్‌పై సత్తెనపల్లి నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి గ్రామానికి చేరుకున్న మంత్రి గ్రామస్తులతో సమావేశమయ్యారు. రానున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని, మరలా ముఖ్యమంత్రి గా జగన్‌మోహన్‌రెడ్డి గెలిచి తీరుతారని జోస్యం చెప్పారు. వైఎస్సార్ సీపీ శ్రేణులంతా సమష్టిగా పనిచేయాలన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి గ్రామస్తులతో మమేకమయ్యారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామ సర్పంచి మోర్తాల రమణారెడ్డి పాల్గొన్నారు.



శ్రీ ఖాజా మట్ [శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం]
e-Procurement Tender
NIT.No.P/COE/301/2024-1, Dt:29-02-2024
www.apeprocurement.gov.in
తేది: 04-03-2024

బాధితుల పక్షానే పోలీస్ వ్యవస్థ ఉండాలి

ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

తూములూరు(తెనాలి): పోలీస్ వ్యవస్థ బాధితుల పక్షాన ఉండాలనీ, రకరకాల ప్రభావాలతో వ్యవహరిస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్ హెచ్చరించారు. కొల్లిపర మండల గ్రామం తూములూరులో ఈనెల 26వ తేదీ తెల్లవారుజామున హత్యకు గురైన నాలాది సాంబశివరావు (చంటి) కుటుంబ సభ్యులను సోమవారం రాత్రి ఆయన పరామర్శించారు. హత్యకు సంబంధించిన వివరాలను మృతుడి తల్లి నాలాది విశ్రాంతమ్మ, సోదరుడు మునికుమార్, అక్క లావణ్యను అడిగి తెలుసుకున్నారు. కేసు పురోగతిపై పోలీసులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీలపై దాడులకు పాల్పడిన వారికి చట్టప్రకారం కఠిన శిక్షలు అమలు జరిగేలా రాష్ట్ర ఎస్సీ కమిషన్ ప్రత్యేక దృష్టితో చర్యలు తీసుకుంటుందని చెప్పారు. సాంబశివరావుతో కుట్రపూరితంగా వివాహేతర సంబంధం పెట్టుకున్న భూలక్ష్మి, ఆమె భర్త కలిసి హత్య చేసినట్టు చెప్పారు. ఎమ్మార్పీఎస్, మాలమహానాడు నాయకులు, బహుజన ఉద్యమకారులు స్పందించి ఉద్యమించటంతో పోలీసులు స్పందించి హత్యకేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసినట్టు చెప్పారు. సాంబశివరావుకు ప్రాణహాని ఉందని అందరికీ తెలుసునని చెబుతూ 2019లోనే భూలక్ష్మి, ఆమె భర్త కలిసి దాడి చేసినట్టు చెప్పారు. అప్పుడే హత్యాయత్నం కేసు నమోదు చేసినట్టయితే ఇప్పుడీ హత్య జరిగి వుండేది కాదన్నారు. ఈ కేసులో పోలీసుల వైఫల్యం స్పష్టంగా ఉందన్నారు. విచారణలో సెక్షన్ 326కు కేసు మార్చినా, నిందితులను అరెస్టు చేయలేదని విక్టర్ ప్రసాద్ చెప్పారు. నిందితులపై రౌడీషీట్ తెరవాలని తెనాలి డీఎస్పీని ఆదేశించారు. రేపటిలోగా మృతుడి కుటుంబ సభ్యులకు రూ.4.12 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఆదేశించారు. మృతుడి తల్లికి పొలం మంజూరు చేయాలన్నారు. ఇప్పటికే ఆరు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేసినట్టు తెలిపారు. దావులూరులో కుర్రాడు ఆదిత్య మరణంపైనా పోలీసుల తీరు సరిగా లేదని ఆయన వ్యాఖ్యానించారు. నిర్లక్ష్యం వహించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని డీఎస్పీని ఆదేశించినట్టు చెప్పారు. సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదనరావు, తెనాలి డీఎస్పీ ఎం.రమేష్, కొల్లిపర తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ రవీంద్రారెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఏఈవో పి.అంకయ్య, ఏఎస్‌డబ్ల్యూఓ శైలజ, హెచ్‌డబ్ల్యూఓ శ్రీనివాసరావు, దళిత సంఘాల నేతలు గెడ్డేటి సురేంద్ర, సాపాటి కిరణ్, చిలకా కిరణ్, రాజేశ్వరరావు, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా కార్యదర్శి వై.అశోక్ తదితరులు పాల్గొన్నారు. తొలుత గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎం.విక్టర్ ప్రసాద్

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మెరిసిన పల్నాడు క్రీడాకారులు

సత్తెనపల్లి: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంటర్ కాలేజీ పవర్ లిఫ్టింగ్ టోర్నమెంట్‌లో పల్నాడు జిల్లా పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులు ప్రతిభ కనబరిచి ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీకి ఎంపికయ్యారు. పురుషుల జట్టులో అశోక్ కుమార్ 66 కేజీల విభాగంలో బంగారు పతకం, టి శివ 66 కేజీల విభాగంలో రజత పతకాలు సాధించారు. మహిళా విభాగంలో ఎం అనూష 47 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించగా టి జ్యోతి 76 కేజీల విభాగంలో బంగారు పతకం కైవసం చేసుకుంది. పల్నాడు టీమ్ ఓవరాల్ టైటిల్స్ స్ట్రాంగ్ మెన్‌గా ఎం.అశోక్ కుమార్, స్ట్రాంగ్ ఉమెన్‌గా టి జ్యోతి నిలిచారు. ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీకి ఎం అశోక్, ఎం అనూష, టీ జ్యోతి ఎంపికయ్యారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా సెక్రెటరీ, కోచ్ పసుపులేటి సురేష్, ప్రెసిడెంట్ జిమ్ రాజు, ఎస్ మణిరత్నం, పి.శంకర్, తదితరులు ఉన్నారు.



గెలుపొందిన క్రీడాకారులతో నిర్వాహకులు

ఏపీ ఎన్‌హెచ్‌ఆర్‌సీ ప్రధాన కార్యదర్శిగా కమలాకరరెడ్డి

నరసరావుపేట: జాతీయ మానవ హక్కుల మండలి(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఇంజినీరింగ్ విభాగంలో ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొమ్మసాని కమలాకరరెడ్డి నియమితులయ్యారు. ఈనెల 3న ఆదివారం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన నేషనల్ లెవెల్ సెమినార్‌లో ఎంపిక జరిగిందని కమలాకరరెడ్డి సోమవారం వెల్లడించారు. జాతీయ చైర్మన్ డాక్టర్ సంపత్‌కుమార్, ఇంజినీరింగ్ విభాగ చైర్మన్ వేల్పుల రామన్న, పలు జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ 10th, ఇంటర్(ఒకేసంలో), డిగ్రీ(1-3సంలో) BA, BCom, BSc, MA, MCom, MBA, MSc (All Groups) పాస్ గ్యారంటీ శిక్షణ, సంప్ర॥ శ్రీవెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్, 2/11 బ్రాడీపేట, Gnt 8008145999

■ Direct 10th/Inter, B.Tech, M.Tech, MBA, MCA, B.A, B.Com, B.Sc, BBA, Diploma, M.A, M.Com, M.Sc, Final year exams(From 2nd April) Contact: 7386706839

■ Single Sitting : 10th, Inter, BA, B.Com, B.Sc, BED, BPED, UGDPED, BBA, MBA, DMLT, BMLT, B.Tech, NURSING ITI, Pharmacy, LLB, Phd : 81435 83986

REAL ESTATE

LAND FOR SALE

■ మంగళగిరి - చినకాకానిపేట హైవేలో కాటూరి మెడికల్ కాలేజ్ మెయిన్‌రోడ్‌కు దగ్గరలో వెంచర్ / గోడౌన్ / ఇన్వెస్ట్‌మెంట్‌కు అనువైన ఏ 1.70 సెంట్లు పొలము అమ్మబడును. సంప్ర. ✆ 90006 30293

SITE FOR SALE

■ గుంటూరు నుంచి అమరావతి వెళ్ళే దారిలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రక్కన నివాసయోగ్యమైన స్పాట్ రిజిస్ట్రేషన్ ప్లాట్లు కలవు. ఫోన్: 98591 27008

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును.(స్పాట్ క్యాష్) ✆ 945 945 3338

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

WANTED

■ ప్రముఖ సెక్యూరిటీ సంస్థలో గుంటూరు, పొన్నూరు, కొండ్రపాడు పరిసర ప్రాంతాలలో 12గం॥ పని చేయుటకు అనుభవం గల సెక్యూరిటీ గార్డులు కావలెను. ఫ్రీరూం+మంచిజీతం 9553013430, 9347294830

■ GNT కాకానిరోడ్, అరండల్‌పేట, పట్టాభిపురంలలో వర్క్ చేయుటకు టెలికాలర్స్, కస్టమర్‌కేర్ 80 కావలెను. వెబ్‌సైట్స్ P/T, F/T, జీ: 8000/- 13000/- T: 9 AM-6PM, స్పాట్ జాయినింగ్ 7780169456, 9985730288

■ తెనాలిలోని ప్రముఖ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో అకౌంట్స్, టాలీ అనుభవంగల అకౌంటెంట్(M/F) & M.S ఆఫీస్, Excel ట్రైనింగ్ అనుభవం గల సిస్టమ్ ఆపరేటర్(Male) కావలెను. 9490157852, 7815829957

■ గుంటూరు ఆటోనగర్‌లోని ప్రముఖ పెట్రోల్‌బంక్‌లో పనిచేయుటకు మేనేజర్ కావలెను. పంప్ బాయ్స్ & గర్ల్స్ P/T, F/T కలరు 7799689889, 8074548302

■ బార్ & రెస్టారెంట్ నందు P/T, F/T పనిచేయుటకు వెయిటర్లు, క్యాషియర్లు కావలెను. రూం+భోజన వసతి కలదు. సంప్ర॥ 9573271161, 8143198968

■ ఉచితంగా కంప్యూటర్, ఇంగ్లీష్, & హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు 3నెలలు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించబడును. స్త్రీలకు మాత్రమే. Age: 18-30సం॥ సంప్ర॥ గుంటూరు, మహిళాప్రాంగణము 8500817656

■ పంజాబ్ నేషనల్ బ్యాంక్ మెట్‌లైఫ్‌లో డిప్యూటీ సేల్స్ మేనేజర్స్, ఇన్సూరెన్స్ మేనేజర్స్ కావలెను. P/T వర్క్ ఫ్రం హోమ్, శాలరీ+ ఇన్సెంటివ్స్ +కమిషన్, నో ఎగ్జామ్, ఆన్‌రోల్ జాబ్ స్త్రీ/పు. 9949839400

■ Wanted D.Ed/ Graduate Lady Teachers for Pre-Primary and Primary Classes. Salary is negotiable. Sri Satya Sai ideal School, Chowtra, Guntur-3, ✆ Ph: 0863-2222114

■ ఉచితంగా కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్, ఎలక్ట్రీషియన్ & బ్రాడ్‌బ్యాండ్ టెక్నీషియన్ కోర్సును నేర్పించి ఉద్యోగం చూపించబడును. ఉచిత వసతి+భోజనం. వ.18-35సం॥, గుంటూరు. ✆ 9133444985/ 89

■ Wanted Teachers for all subjects from LKG to X in E.M and PET, Computer, Communication skills. 9908083054. Attractive Salary & prompt payment

■ Bright Kids School నందు అనుభవం, అర్హత కలిగిన టీచర్స్ కావలెను (నర్సరీ -10క్లాస్) M.S.M Vocational Jr College లో PRO లు కావలెను (MLT, MPHW (P), Agri, Vete) Courses అడ్మిషన్లు జరుగుచున్నవి. 7386706839

■ ప్రముఖ కంపెనీలో పార్ట్‌టైమ్ మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సాప్ చేయగలరు. 98856 82589

■ NTR Bus Station గుంటూరు-2 డిపో గ్యారేజ్ నందు ITI డీజిల్, ఫిట్టర్ చేసిన అభ్యర్థులు కావలెను. మరియు ఐంద్ర, అమరావతిA/c బస్సులలో అటెండర్లుగా పనిచేయుటకు అభ్యర్థులు కావలెను. 7794950961

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573883520, 89197 39894.

■ ప్రముఖ స్కూల్‌లో వర్క్ చేయుటకు డేటా ఎంట్రీ & కంప్యూటర్ ఫ్యాకల్టీ ఎంప్లాయిస్ కావలెను. జీతం: 18,000, విద్యార్హత: ఇంటర్ /డిగ్రీ. సెల్: 63013 32360.

■ రామకృష్ణ గ్రూపు, (AP, న్యూ ఢిల్లీ No.1) శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, ఇంటి / వంట పని, టీటీకేర్ కొరకు M/F వర్కర్స్ కావలెను. భో+వ + జీ. 15-18 వేలు, ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 62812 08567, 92814 52827

■ చీరాల బస్టాండ్ లోపల షాప్‌లో పనిచేయుటకు లేడీ ఎంప్లాయిస్ కావలెను. 9 to 6PM జీతం 8 వేలు సంప్రదించండి. ✆ 80086 05210

■ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12 గం. డ్యూటీ. 45 సం. లోపు వయసు ఉండాలి. మగవారు మాత్రమే. జీతం : 12,000/-. వివరాలకు సంప్రదించండి. సెల్ : 72880 04486.

■ ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రమ్ హోం స్త్రీ/పు కావలెను. జీతం : 15–25 వేలు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. సంప్ర. 95027 12418, 90306 12463.

■ డ్వాక్రా మహిళలకు నిరుద్యోగులకు, ఇంట్లో ఉంటూ పెట్టుబడి మీరే పెట్టుకొని కొవ్వొత్తులు, పెన్సిల్స్, తయరు చేసినవి తీసుకొనబడును. గ్రూప్‌లకు ఉచిత శిక్షణ. 9491995565

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ఈ సెల్ నెంబర్లలో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167541
7075167663

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

WANTED
* OT Technicians
* OT Helpers
* OT Scrub Nurses
* Anesthesia Technicians
* ICU experience Duty Doctors
* Cathlab Scrub Nurses
Share resumes on:
SRESHTA HOSPITALS
9488223333

EXCITING OPPORTUNITY!
25 Years of Excellence in Automobile Industry
We're hiring talented individuals to join our dynamic team.
Join us in shaping the future of the Automobile Industry.
OPEN POSITIONS
• Sales Manager
• Team Leader
• Sales Executive
• Receptionist
• Service Manager
• Mechanics
• Service Advisors
• Helpers
• Water Washing Boys
• Sweepers
• Spare Parts Manager
• CRM & CRE
WE ARE HIRING!
WALK-IN
5th March, Tuesday
Experience in Two Wheeler & Premium Two Wheeler Segment
Salary: Best in the industry
Jayalakshmi Bikes Pvt Ltd
Contact: +91 96144 55555
3rd Phase, Auto Nagar, 100 feet Road, Guntur
Jayalakshmi BigWing
+91 96144 55555
Honda BigWing